సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



తండాలకు మహర్దశ

తండాలకు మహర్దశ వచ్చింది. రహదారులను బీటీ రోడ్లుగా మార్చేందుకు గిరిజన సంక్షేమ శాఖ నిధులు విడుదల చేసింది. 10లో▸



వ్యతిరేక విధానాలపై పోరాటం

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. 10లో▸


నేడు ఖైరతాబాద్ మహాగణపతికి 'నేత్రోనిలనం'

ఖైరతాబాద్: తుది మెరుగులు దిద్దుకుంటున్న శ్రీ దశమహా విద్యాగణపతికి శుక్రవారం సాయంత్రం 4.30 నుంచి 5 గంటల్లోపు నేత్రోనిలనం (కంటిపాప) అమర్చే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గురువారం శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ తెలిపారు. దివ్యజ్ఞాన సిద్ధాంతి గౌరీభట్ల విఠల శర్మ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

అక్షరాలా మూడు లక్షలపైనే..

వినియోగదారుడికి కరెంట్ బిల్లు షాక్



లక్షల్లో వచ్చిన విద్యుత్ బిల్లు

షాద్‌నగర్‌రూరల్: ప్రతీనెల వేలల్లో వచ్చే విద్యుత్ బిల్లు ఒక్క సారిగా లక్షల్లో వచ్చింది. బిల్లును చూసిన వినియోగదారుడు ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. ఈ సంఘటన గురువారం షాద్‌నగర్ పట్టణంలో వెలుగు చూసింది. పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీనివాస జనరల్ స్టోర్‌కు ప్రతి నెల దాదాపు రూ.1,500 నుంచి రూ.2,000 వరకు విద్యుత్ బిల్లు వస్తుంది. ఆగస్టు నెలకు సంబంధించిన బిల్లు ఏకంగా రూ.3,73,763 వచ్చింది. బిల్లును చూసిన షాపు యజమాని పొగాకు ప్రకాష్ నివ్వెరపోయాడు. వేలల్లో వచ్చే బిల్లు లక్షల్లో రావడంతో అధికారులను అడిగేందుకు విద్యుత్ కార్యాలయానికి వెళ్లాడు. ఏఈ, లైన్‌మన్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందిని సంప్రదించాడు. అధికారులతో మాట్లాడి బిల్లును సరి చేస్తామని సిబ్బంది సమాధానమిచ్చి పంపించారు.

17న వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ఈ నెల 17న తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ హరీశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కొంగరకలాన్‌లో ఉదయం 9 గంటలకు వేడుకలు నిర్వహించాలని తెలిపారు. జాతీయ జెండాను ఆవిష్కరించడానికి మంత్రి సబితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొనాలని కోరారు.

రాష్ట్రస్థాయి స్వచ్ఛత అవార్డు ప్రదానం



మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

కందుకూరు: స్వచ్ఛ సర్వేక్షణ్‌– 2023 రాష్ట్ర స్థాయి స్వచ్ఛత అవార్డును మండల పరిధిలోని నేదునూరు కైవసం చేసుకుంది. రాజేంద్రనగర్‌లోని రాష్ట్ర శిక్షణాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, డీఆర్‌డీ పీడీ ప్రభాకర్, ఎంపీడీఓ ఎస్.వెంకట్రాములు, ఎంపీఓ కల్యాణి పాల్గొన్నారు.

నేడే టెట్..

- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ!
- గ్రేటర్ జిల్లాల్లో 387 కేంద్రాలు
- మొత్తం అభ్యర్థులు 91,636 మంది

సాక్షి, సిటీబ్యూరో: టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)కు సర్వం సిద్ధమైంది. గ్రేటర్‌లోని హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 387 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో సెంటర్‌లో 240 మందిని కేటాయించారు. శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో నిర్వహించే పరీక్షకు మొత్తం 91,636 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్షలు పూర్తిగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో కొనసాగనున్నాయి. అభ్యర్థులను అరగంట ముందే సెంటర్‌లోకి అనుమతించనున్నారు. నిర్దేశిత సమయానికి నిమిషం ఆలస్యమైనా.. అనుమతించరు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఏమాత్రం ఇబ్బంది తలెత్తకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, మంచినీరు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్‌–1. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్‌– 2 పరీక్ష నిర్వహించనున్నారు. పోలీసులు ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు వెంట బ్లాక్‌బాల్ పెన్ను మినహా ఏ ఇతర వస్తువులను తీసుకురావొద్దు. వెంట తెచ్చుకున్న వస్తువులును గేటు బయట ఏర్పాటు చేసిన కౌంటర్లలోనే భద్రపర్చుకోవాల్సి ఉందని సంబంధిత అధికారులు ప్రకటించారు.




మొయినాబాద్‌లో కొలువుదీరిన వినాయక విగ్రహాలు

గణనాథులు సిద్ధం

గణేశ్ ఉత్సవాలకు ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. వినాయక చవితి సమీపిస్తుండడంతో విగ్రహాలు తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. ఈ నెల 18న మండపాలకు చేరేందుకు ముస్తాబవుతున్నాయి.

మొయినాబాద్‌లో వినాయక విగ్రహాలను ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన కళాకారులు మూడునెలలుగా స్థానికంగా మకాం వేశారు. వివిధ రూపాల్లో రకరకాల రంగులతో ప్రతిమలకు ప్రాణం పోస్తున్నారు. విగ్రహాల ఎత్తు, రూపాలను బట్టి రూ.10వేల నుంచి రూ.60 వేల వరకు విక్రయిస్తున్నట్లు తయారీదారులు చెబుతున్నారు.

– మొయినాబాద్



విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారుడు

విజయభేరికి సన్నద్ధం

- **చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు**
- వేదికపై 250 మందికిపైగా అతిథులు
- సభా స్థలిని పరిశీలించిన కాంగ్రెస్ నేతలు



సభాస్థలిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తుక్కుగూడ వేదికగా ఈ నెల 17న నిర్వహించతలపెట్టిన కాంగ్రెస్ విజయభేరి సభకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం మహేశ్వరం, ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు దేప భాస్కర్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, పలువురు జిల్లా నాయకులు పరిశీలించారు. వంద ఎకరాల విస్తీర్ణంలో సభాస్థలిని ఏర్పాటు చేశారు. ఖాళీ స్థలంలోని చెట్ల పొదలను తొలగించారు. ఎగుడు, దిగుడు ప్రాంతాలను జేసీబీలతో సరి చేశారు. ప్రాంగణంలో మొత్తం మూడు ఓపెన్ ఎయిర్ వేదికలను ఏర్పాటు చేశారు. ప్రధాన వేదికపై ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ సహా అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పీసీసీ చీఫ్, ఎంపీ ఉత్తమ్, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ మాత్రమే ఆసీనులు కానున్నారు. ప్రధాన వేదికకు కుడివైపున ఏర్పాటు చేసిన మరో వేదికపై ఏఐసీసీ సభ్యులు, పీసీసీ సభ్యులు, మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీలు కూర్చోనున్నారు. కళాకారుల కోసం ఎడమవైపు మరో స్టేజీ ఏర్పాటు చేశారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఆయా వేదికల కింద కాంక్రీట్ వేశారు. ఎంపిక చేసిన సభాస్థలి చుట్టూ రక్షణగా ఇనుప కంచెలను ఏర్పాటు చేశారు. వాటికి ఆనుకుని పార్టీ జెండాలు నాటారు. సాయంత్రం ఐదు నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించే ఈ బహిరంగ సభకు దేశ వ్యాప్తంగా ఉన్న సుమారు 250 మంది పార్టీ ముఖ్యులు హాజరు కానున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభకు తెలంగాణ వ్యాప్తంగా సుమారు 10 లక్షల మందిని తరలించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు ఆయా నియోజకవర్గాల నేతలకు టార్గెట్లు ఇచ్చారు. పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానుల వాహనాల కోసం సభావేదికకు సమీపంలోనే మరో వంద ఎకరాల్లో పార్కింగ్ కేంద్రాలను ఎంపిక చేశారు. ఏపుగా పెరిగిన చెట్లను తొలగించి, గుంతలను పూడ్చే పనిలో నిమగ్నమ్యారు. సభలో సోనియాగాంధీ, ఖర్గే, రాహుల్, ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రమే ప్రసంగించనున్నారు. పీసీసీ నుంచి రేవంత్ సహా మరో ముగ్గురికి అవకాశం లభించనుంది.

కాంగ్రెస్ వైపు కసిరెడ్డి చూపు..?

- టచ్‌లోకి ఏఐసీసీ, పీసీసీ ముఖ్యులు
- బీఆర్‌ఎస్‌ను వీడి.. తమతో కలిసిరావాలని సంప్రదింపులు
- హస్తంలో చేరికపై ఒత్తిడి తెస్తున్న అభిమానులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కారు దిగి.. హస్తం గూటికి చేరుకోనున్నారా? అంటే అవుననే అంటున్నారు ఆయన సన్నిహితులు. కొంత కాలంగా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో విభేదాలున్న విషయం తెలిసిందే. అధిష్టానం తిరిగి ఆయనకే టికెట్ ఇవ్వనున్నట్లు ఇటీవల ప్రకటించిన సంగతి విధితమే. సిట్టింగ్ అభ్యర్థికి టికెట్ కేటాయించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన సన్నిహితులు, అభిమానులతో వరుస సమావేశాలు ఏర్పాటు చేయించి, సిట్టింగ్ అభ్యర్థికి వ్యతిరేకంగా బహిరంగ ప్రకటనలు కూడా చేయించారు. అయినప్పటికీ.. అధిష్టానం వైఖరిలో మార్పు రాలేదు. సీఎం కేసీఆర్ సహా మంత్రి కేటీఆర్ కూడా జైపాల్ వైపే మొగ్గుచూపడంతో పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటూ వస్తున్నారు. తాజాగా ఆయన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి సహా పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డితో మాట్లాడినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ మేరకు వారు రాహుల్‌గాంధీతో కూడా ఫోన్‌లో మాట్లాడించినట్లు సమాచారం. కాంగ్రెస్ పెద్దల నుంచి ఆహ్వానం అందడంతో అభిమానులు ఆయనపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న ఆయన పార్టీ మారే విషయంలో ఎటూ తేల్చుకోలేకపోతున్నట్లు వినికిడి. ఎమ్మెల్సీగా మరో నాలుగేళ్ల పదవీకాలం ఉంది. ఈ అవకాన్ని వదులు కొని పార్టీ వీడతారా? అనే సందేహం వ్యక్తమవుతుంది.

ఓయూలోకి ఇక నో ఎంట్రీ!

- విద్యార్థులకు తప్ప ఇతరులకు ప్రవేశం లేదు
- ఎన్‌సీసీ జంక్షన్– అడిక్‌మెట్ ఫ్లై ఓవర్ వరకు..

సాక్షి, సిటీబ్యూరో: ఉస్మానియా విశ్వవిద్యాలయం మీదుగా ఇక అన్ని వర్గాల వారు ప్రయాణించకుండా అధికారులు ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేయనున్నారు. కేవలం విద్యార్థులకు మాత్రమే ఓయూలోకి అనుమతించేలా చూడాలని భావిస్తున్నారు. ఇందుకోసం – ప్రత్యామ్నాయంగా లింక్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం తార్నాక వైపు నుంచి హిందీ మహా విద్యాలయ, విద్యానగర్, నల్లకుంట తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు..ఆ ప్రాంతాల నుంచి తార్నాక వైపు వెళ్లాల్సిన వారు ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) నుంచే వెళ్లాల్సి వస్తోంది. ఈ కారణంగా వర్సిటీ ప్రశాంత వాతావరణానికి భంగం కలుగుతోంది. ఈ పరిస్థితి నివారించేందుకు మునిసిపల్ మంత్రి కేటీఆర్ మానసపుత్రికగా ప్రారంభమైన లింక్/స్లిప్ రోడ్ నిర్మాణం ఉపకరిస్తుందని అధికారులు గుర్తించారు. తద్వారా సమస్యకు పరిష్కారం లభించనుండటంతో అందుకు సిద్ధమయ్యారు. ఓయూ క్యాంపస్‌లోకి రానవసరం లేకుండా ఉపకరించే ప్రత్యామ్నాయంగా లింక్ రోడ్డు నిర్మాణం త్వరలో చేపట్టనున్నారు. యూనివర్సిటీ ఎన్‌సీసీ గేటు నుంచి అడిక్‌మెట్ ఆర్‌టీబీ వరకు దాదాపు 1.20 కి.మీ.లతో ఈ లింకు రోడ్డు హెచ్ఆర్‌డీసీఎల్ (హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) ఆధ్వర్యంలో నిర్మించనున్నారు. అంచనా వ్యయం రూ.16 కోట్లుగా నిర్ణయించామని హెచ్ఆర్‌డీసీఎల్ చీఫ్ ఇంజినీర్ సరోజరాణి తెలిపారు. వంద అడుగుల వెడల్పుతో నాలుగులేన్లలో, ఫుట్‌పాత్‌లతో సహా నిర్మించే ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే వాహనాలిక ఓయూలోకి వెళ్లాల్సిన అవసరం ఉండదు. రోడ్డు నిర్మించే ప్రాంతాన్ని స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, ఓయూ వీసీ రవీందర్, ఇంజినీర్లు ఇటీవల పరిశీలించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నియోజకవర్గాల వారీగా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించి, ఆయా పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. ఈ మేరకు గురువారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు హరీశ్, అమయ్‌కుమార్, రాచకొండ పోలీసు కమిషనర్ డీసీ చౌహాన్‌తో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై సమావేశం ఏర్పాటు చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సమస్యాత్మక స్టేషన్ల గుర్తింపు, అసెంబ్లీ నియోజకవర్గాల కోసం గుర్తించిన పంపిణీ, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతపై చర్చించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ.. ఓటరు జాబితాల పంపిణీ, రిసెప్షన్ కౌంటర్లు, కౌంటింగ్ కేంద్రాలను ఎంపిక చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ సంగీత, కందుకూరు, కల్వకుర్తి, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం ఆర్డీఓలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

పొదుపును అలవర్చుకోండి

- కుటుంబాన్ని రక్షించుకోండి
- డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ బాల్‌రాజ్
- సాక్షి యాప్‌పై అవగాహన

షాద్‌నగర్‌రూరల్: ప్రతి మహిళ పొదుపును అలవర్చుకొని ఆపద సమయంలో కుటుంబాన్ని రక్షించుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ బాల్‌రాజ్ అన్నారు. పట్టణంలోని మహిళా సమాఖ్య భవనంలో గురువారం ఏపీఎం నగేష్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు సాక్షి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. మహిళలు ప్రతీనెల కొంత పొదుపు చేసుకోవాలని సూచించారు. మనం చేసే పొదుపు ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. పొదుపు సూత్రాన్ని పాటించకుంటే మనకు కష్టం వచ్చినప్పుడు ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుందని తెలిపారు. సాక్షి యాప్‌లో మహిళా సంఘాల సభ్యుల వివరాలను తెలుసుకోవచ్చని అన్నారు. సంఘంలో ఎంతమంది చదువుకొన్నారు, ఎంత మంది సంతకాలను చేయగలుగుతారు,ఎంతమంది వ్యక్తిగత బ్యాంక్ లావాదేవీలను జరిపారు అనే విషయాలను తెలుసుకోవచ్చని వివరించారు. సంఘంలోని సభ్యులు ఎంతమంది ప్రమాదబీమా చేసుకున్నారు, ఎంత మంది ఆరోగ్యబీమా తీసుకున్నారు, ఎంతమంది బ్యాంక్ ఖాతాకు ఆధార్‌తో అనుసంధానం చేశారు, ఎంతమంది ఫోన్ వాడుతున్నారనే విషయాలు తెలుస్తాయన్నారు. సంఘం సభ్యులంతా ఎప్పటికప్పుడు తమ వివరాలను సాక్షి యాప్‌లో న మోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ జిల్లా రీసోర్స్ పర్సన్ వినోద్, బీఓఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



సాక్షి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ బాల్‌రాజ్

క్రీడాకారులకు అన్నివిధాలా ప్రోత్సాహం

- మంత్రి మహేందర్‌రెడ్డి



బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

మొయినాబాద్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ క్రీడలకు పెద్దపీట వేస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్‌లోని గుత్తా జ్వాల అకాడమీలో నిర్వహిస్తున్న అండర్‌–15, అండర్‌–17 బాలబాలికల 36వ యోనెక్స్ సన్‌రైస్ సబ్ జూనియర్ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను గురువారం మంత్రి చేతులమీదుగా ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 560 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న క్రీడా పాలసీ దేశానికి వన్నెతెచ్చేలా, క్రీడాకారుల నైపుణ్యం పెంచేలా ఉందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలో 18 వేల గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశామన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని.. గతంలో పీవీ సింధు, సానియామీర్జా వంటి క్రీడాకారులను ప్రోత్సహించిన విషయాన్ని గుర్తు చేశారు. క్రీడా పాలసీ కోసం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కూడిన మంత్రి వర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని.. మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు మేరకు మౌలిక సదుపాయాల కల్పన చేపడుతున్నామన్నారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ క్రీడాకారిణి గుత్తా జ్వాల, భారత జాతీయ బ్యాడ్మింటన్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్‌బిస్వా, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి వంశీ, ఎండీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి

- శంషాబాద్ ఏసీపీ రాంచందర్‌రావు

కొత్తూరు: వినాయక చవితి వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని శంషాబాద్ ఏసీపీ రాంచందర్‌రావు సూచించారు. పట్టణంలోని రాధాగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఆయా గ్రామాలకు చెందిన వినాయక మండపాల నిర్వాహకులు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేశ్ మండపాల నిర్వాహకులు విద్యుత్ కనెక్షన్ల కోసం ట్రాన్స్‌కో అధికారుల నుంచి అనుమతి పొందాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు వర్షాలు కురిసే సమయంలో లైట్లను ఆర్పివేయాలని సూచించారు. రాత్రి 10 తర్వాత మైకులు వినియోగించొద్దన్నారు. డీజేలకు అనుమతి లేదనే విషయాన్ని గ్రహించాలని కోరారు. 18న ప్రతిష్ఠించే విగ్రహాలను ఈ నెల 28లోపు నిమజ్జనం చేయాలన్నారు. నిమజ్జన సమయంలో చిన్నారులు, ఈత రాని వారిని చెరువుల వద్దకు తీసుకురావద్దన్నారు. వేడుకల నిర్వహణలో మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ శంకర్‌రెడ్డి, ఎస్‌ఐలు కె.శ్రీనివాస్, జి. శ్రీనివాస్, ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ రాంచందర్‌రావు

నందిగామలో శాంతి సమావేశం

నందిగామ: వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకొనేందుకు ప్రతి ఒక్కరూ కృషి చే యాలని శంషాబాద్ ఏసీపీ రాంచందర్ రావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం స్థానిక ఇన్‌స్పెక్టర్ సురేష్ అధ్యక్షతన వినాయక ఉత్సవ కమిటీలతో శాంతి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపాలకృష్ణ, జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీటీసీలు దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై మాల్ కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. యాచారం సీఐ సైదయ్య తెలిపిన వివరాలు.. మాడ్గుల్ మండలం కొల్కులపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య(45) గురువారం మధ్యాహ్నం మాల్‌లోని మౌనిక వస్త్రాలయం ఎదురుగా రోడ్డుదాటుతున్న సమయంలో ఓ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఓ ప్రవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మల్లయ్య మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యాచారంలో వాహనాల తనిఖీ

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం మండల కేంద్రంలో గురువారం యాచారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. మొండిగౌరెల్లి చౌరస్తాలో సాగర్ రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాలను నిలిపి తనిఖీలు చేపట్టారు. అతివేగంగా నడుపుతున్న, లైసెన్స్‌లు లేని డ్రైవర్లను గుర్తించి హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధించారు. ఎస్‌ఐ గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

8మంది అనుమానితుల బైండోవర్

అబ్దుల్లాపూర్‌మెట్: వినాయకచవితి, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 5మంది అనుమానిత వ్యక్తులను (షీటర్) అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ ముందు పోలీసులు గురువారం బైండోవర్ చేశారు. తారమతిపేట గ్రామానికి చెందిన కటికే శ్రీను, పసుపునేటి మహేష్, కటికె స్వామి, ఉమర్‌ఖాన్ గూడకు చెందిన వినాయక్‌దేశ్‌ముఖ్, గుంతపల్లి గ్రామానికి చెందిన నయీంల ప్రవర్తన అనుమానకరంగా ఉండటంతో వారు శాంతిభద్రతలకు భంగం కల్గించే విధంగా ప్రవర్తించే అవకాశమున్నందున ముందు జాగ్రత్త చర్యలో భాగంగా వారిలో సత్ప్రవర్తన రావాలన్న ఆలోచనతోనే బైండోవర్ చేసినట్లు సీఐ మన్మోహన్ తెలిపారు.

గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ పరిధిలో..

యాచారం: వినాయక చవితి, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముగ్గురు రౌడీ షీటర్లను గురువారం కందుకూర్ తహసీల్దార్ కృష్ణయ్య ముందు బైండోవర్ చేసినట్లు సీఐ రామాంజనేయులు తెలిపారు. గొట్టిలగడ్డ తండాకు చెందిన కొర్రరాజు, ఆకులామైలారం గ్రామానికి చెందిన రావుల మల్లేష్, మాలగూడెంకు చెందిన జిట్టి పవన్‌కుమార్‌ను తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా వారిలో సత్ప్రవర్తన కోసమే బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌గౌడ్

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌గౌడ్

హుడాకాంప్లెక్స్: రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి వెట్టి చాకిరీ నుంచి ప్రజలను విముక్తి చేసింది కమ్యూనిస్టు పార్టీలేనని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. సరూర్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో గురువారం డాక్టర్స్ కాలనీలో నిర్వహించిన రైతాంగ పోరాట వార్షికోత్సవ సభకు ప్రభాకర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రావినారాయణరెడ్డి, దొడ్డి కొమురయ్య, ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ లాంటి అనేకమంది నాయకులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నారని, నాటినుంచి నేటి వరకు పోరాటాలు చేస్తున్నది కమ్యూనిస్టులేనని గుర్తు చేశారు. భూస్వాముల నుంచి దాదాపు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదన్నారు. అనంతరం సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జంగయ్య మాట్లాడుతూ.. సాయుధ పోరాటం నుంచి నేటివరకు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ నేడు దొరలపాలైందని, రాష్ట్రం సాధించినా పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అదే విధంగా స్థానిక ఎన్టీఆర్‌నగర్‌లో ఇంటి స్థలాల రెగ్యులరైజేషన్ కుర్చీ వేసుకుని రెండునెలల్లో చేయిస్తానని హామీలు ఇచ్చినవారు ఇప్పటికీ పత్తాలేరన్నారు. రానున్న రోజుల్లో ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలతో కలిసి సీపీఐ పార్టీ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందని అన్నారు. సీపీఐ మహేశ్వరం నియోజకవర్గ కోకన్వీనర్ ప్రవీణ్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రాచారి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ దత్తు నాయక్, సరూర్‌నగర్ మండల కన్వీనర్ బాతరాజు నర్సింహ, నాయకులు పూజారి శ్రీను, కందుల సుధాకర్, ఇస్మాయిల్, రాములుగౌడ్, యాదయ్యగౌడ్, శత్రునాయక్, లక్ష్మీ, రాధా తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. దీపిక

జూడో చాంపియన్‌షిప్‌లో గురుకుల విద్యార్థినికి వెండి పతకం

మొయినాబాద్ రూరల్: ఇటీవల ఓవైసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో చందులాల్ బారాదరి హైదరాబాద్‌లో నిర్వహించిన 8వ తెలంగాణ సీనియర్ స్టేట్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల కళాశాల విద్యార్థిని దీపిక(ఎంపీసీ) 48 కేజీల విభాగంలో వెండి పతకం సాధించింది. ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న దీపికను ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో రివిజినల్ ఆర్‌సీఓ శారదవెంకటేష్, ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

తండాలకు మహర్దశ



బీటీగా మారనున్న తండాకు వెళ్లే రోడ్డు

- బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.10.25 కోట్లు మంజూరు
- ఉత్తర్వులు జారీచేసిన గిరిజన సంక్షేమ శాఖ
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

షాద్‌నగర్: తండాలకు మహర్దశ వచ్చింది. తండాలకు వెళ్లే రహదారులను బీటీ రోడ్లుగా మార్చేందుకు గిరిజన సంక్షేమ శాఖ నిధులు విడుదల చేసింది. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని పలు తండాలకు వెళ్లే రోడ్లను బీటీ రోడ్లుగా నిర్మించేందుకు గాను ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ రూ.10.25 కోట్ల నిధులు మంజూరు చేయించారు.

ఏ రోడ్డుకు.. ఎన్ని నిధులు?

కొత్తూరు మండల పరిధిలోని దర్గారోడ్డు నుంచి కోకర్న పరిశ్రమ మీదుగా కోల్‌బాయితండా వరకు 2 కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.60కోట్లు, ఫరూఖ్‌నగర్ మండలం పెంజర్ల నుంచి జీడిగడ్డ తండా వరకు 1.50 కిలోమీటర్ల దూరం రూ.1.20కోట్లు, కేశంపేట మండలం చింతగట్టు తండా నుంచి పోల్కొనిగుట్ట తండా వరకు 1.5 కిలోమీటర్ల దూరానికి గాను రూ.1.20 కోట్లు, పీఆర్ రోడ్డు నుంచి నానుతండా వయా బాల్యాతండా వరకు 3కిలోమీటర్ల దూరం రూ.2కోట్లు, ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి బలిజరాల తండా వరకు రూ.65లక్షలు, ఫరూఖ్‌నగర్ మండలంలో జెడ్పీ రోడ్డు నుంచి పిట్టలగడ్డ తండా వరకు ఒక కిలోమీటర్ దూరం రూ.70లక్షలు, కొత్తూరు మండలం పీఆర్ రోడ్డు నుంచి ధరోమ్య తండాడ వరకు రూ.30లక్షలు, కొందుర్గు మండలంలో పీఆర్ రోడ్డు నుంచి చీలంబాయి తండా వరకు 2 కిలోమీటర్ల దూరం రూ.1.50 కోట్లు, నందిగామ మండలం ఎంఎస్ఎన్ పరిశ్రమ నుంచి పెద్దకుంట తండా వరకు రూ.40లక్షలు, జిల్లేడు చౌదరిగూడ మండలం జాకారం జెడ్పీ రోడ్డు నుంచి వేపకుచ్చతండా వరకు ఒక కిలోమీటర్ దూరం రూ.70లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది.

త్వరలో పనులు ప్రారంభం..

నియోజకవర్గంలోని పలు తండాలకు వెళ్లే 13.80 కిలోమీటర్ల మేర రోడ్డును బీటీ మార్చేందుకు రూ.10.25కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి పనులను ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

నిధుల మంజూరు అభినందనీయం



గత ప్రభుత్వాలు తండాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయి. బీఆర్ఎస్ సర్కార్ తండాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుంది. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తండాలకు బీటీ రోడ్లును నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించడం అభినందనీయం

– లక్ష్మణ్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, ఫరూఖ్‌నగర్

తండాల అభివృద్ధికి కృషి



ప్రభుత్వం తండాల అభివృద్ధికి పెద్దపీట వేసింది. తండాలకు వెళ్లే మట్టిరోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు గాను రూ.10.25కోట్లు మంజూరు చేసింది. రోడ్ల నిర్మాణంతో తండాలకు రాకపోకలు సులువు కానున్నాయి. వీలైనంత త్వరగా పనులు ప్రారంభిస్తాం

– అంజయ్య యాదవ్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

చోరీలకు పాల్పడుతున్న యువకుల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న బైక్‌లు

- నాలుగు బైక్‌లు స్వాధీనం
- నిందితుల రిమాండ్

కడ్తాల్: వివిధ ప్రాంతాల్లో బైక్ చోరీలకు పాల్పడుతున్న తలకొండపల్లి మండలానికి చెందిన ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపారు. ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపిన వివరాలు.. తలకొండపల్లి మండలంలోని హర్యానాయక్ తండాకు చెందిన అరుణ్, అదే మండలం పడకల్ గ్రామానికి చెందిన నిఖిలేశ్వర్ నెల రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా బైక్ చోరీలకు పాల్పడుతూ.. ఎవరికీ చిక్కకుండా తిరుగుతున్నారు. వీరిద్దరూ కలిసి ఇటీవల కడ్తాల్‌లో 2 బైక్‌లు, హైదరాబాద్ నగరంలోని ఫలక్‌నుమాలో స్కూటీ, మక్తమాధారంలో ఓ బైక్‌తో మొత్తం 4 వాహనాలను చోరిచేశారు. గురువారం శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై తలకొండపల్లి కూడలి వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా బైక్‌పై వెళ్తున్న ఈ ఇద్దరి ప్రవర్తన అనుమానకరంగా ఉండటంతో వారిని పట్టుకుని విచారించగా బైక్ దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారివద్ద నుంచి చోరీకి గురైన 4 బైక్‌లను స్వాధీనం చేసుకోవడంతో పాటు వారిని అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం ఆమనగల్లు కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు. బైక్ దొంగలను చాకచక్యంగా పట్టుకున్న హెడ్‌కానిస్టేబుల్ గోపాల్, కానిస్టేబుల్ రామ్‌కోటి, యాదగిరి, శ్యాంసన్‌ను పోలీస్ అధికారులు అభినందించారు.

అనారోగ్యంతో ఇద్దరు మహిళలు మృతి



లక్ష్మి (ఫైల్)



చంద్రమ్మ (ఫైల్)

మొయినాబాద్: ఒకే భర్తతో జీవితం పంచుకున్న ఇద్దరు భార్యలు ఒకేరోజు మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరూ ఒకేరోజు మరణించడంతో వారి కుటుంబంతోపాటు గ్రామంలో విషాదాన్ని నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలంలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన మంగళారం అంతయ్యకు.. ఇద్దరు భార్యలు. పెద్ద భార్య లక్ష్మి(55), చిన్నభార్య చంద్రమ్మ(40). కొంతకాలంగా ఇద్దరూ అనారోగ్యానికి గురయ్యారు. కాగా గురువారం తెల్లవారుజామున తీవ్ర అనారోగ్యానికి గురైన చిన్నభార్య చంద్రమ్మ ఇంట్లోనే మృతి చెందింది. ఆ తరువాత కొన్నిగంటల వ్యవధిలోనే ఉదయం 7గంటల సమయంలో పెద్దభార్య లక్ష్మి కూడా మరణించింది. ఇద్దరు భార్యలు ఒకేసారి మరణించడంతో భర్త అంతయ్య శోకసంద్రంలో మునిగిపోయాడు. ఆ కుటుంబం దహన సంస్కారాలకు సైతం డబ్బులు లేని కడుపేదరికంలో ఉంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దర్శన్ గ్రామానికి చేరుకుని దహన సంస్కారాలకు ఆర్థికసహాయం అందజేశారు.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్



మాట్లాడుతున్న ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్

కడ్తాల్: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతవరణంలో నిర్వహించుకోవాలని ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వార్డు సభ్యులు, మండపాల నిర్వాహకులు, యువజన సంఘాల సభ్యులతో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రధాన కూడళ్ల వద్ద రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, యువజన సంఘాల నాయకులు ఉన్నారు.

సేవా గుణం అలవర్చుకోవాలి



నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ సామాజిక సేవాదృక్పథం అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల మండలంలోని దామరగిద్ద గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం గ్రామానికి చెందిన రిపోర్టర్ ఆనంద్ తన కొడుకు పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించాడు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, స్థానిక సర్పంచ్ వెంకటేశంగుప్తా పాల్గొని విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. పుట్టినరోజున వృథా ఖర్చులు కాకుండా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రమణారెడ్డి, క్రిష్ణారెడ్డి, ప్రభాకర్, శ్రీలత అంజయ్య, అనిల్, కుమార్, రామయ్య, అంబేడ్కర్ సంఘం నాయకులు మల్లేశ్, బాబు జగ్జీవన్‌రామ్ సంఘం నాయకులు, సమతా సైనిక్‌దళ్ నాయకులు ఆల్‌ఇండియా అంబేడ్కర్ సంఘం నాయకులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సందడిగా గాంధీ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ 69వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు గాంధీ అలుమ్నీ అసోషియేషన్ ఆధ్వర్యంలో గురువారం సందడిగా జరిగాయి. అలుమ్నీ అసోషియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాజారెడ్డి, గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావులు ముఖ్యఅతిథులుగా హజరై వేడుకల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతు వైద్యరంగానికి తమవంతు సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. అనేక సామాజిక సేవ కార్యక్రమాలతోపాటు వైద్యవిద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. సీపీఆర్, బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్)లపై సుమారు పదివేల మందికి ఉచిత శిక్షణ అందించామని అలుమ్నీ అసోషియేషన్ ఛైర్మన్ డాక్టర్ జీఆర్ లింగమూర్తి వివరించారు. అనంతరం ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన 36 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు అందించారు. తమకు వైద్యవిద్యను బోధించిన ఆనాటి గురువులు సుజాత, శ్రీనివాసరెడ్డి, శ్రీరాంరెడ్డి, మనోహర్‌రెడ్డిలతో పాటు, బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై ఉచిత శిక్షణ ఇచ్చిన వైద్యులు మహేశ్వరరెడ్డి, విజయరావు, బాస్కర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అలుమ్నీ ప్రతినిధులు లింగమూర్తి, వెంకటరత్నం, చంద్రశేఖర్, నందకుమార్‌తో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

కోర్టు నిర్మాణానికి రూ.24 కోట్లు

మహేశ్వరం: కందుకూరులో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నిర్మాణానికి రూ.24 కోట్లు కేటాయించడం హర్షణీయమని మహేశ్వరం బార్ కౌన్సిల్, బీఆర్ఎస్ లీగల్‌సెల్ న్యాయవాదులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు మంత్రి సబితారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న మహేశ్వరం కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని.. ఇది న్యాయవాదులతో పాటు కక్షిదారులకు ఎంతో ప్రయోజనకరంగా మారుతుందన్నారు. అదే విధంగా కందుకూరులో రెసిడెన్షియల్ న్యాయ కళాశాల, బీఏ, ఎల్ఎల్‌బీ, బీబీఏ ఎల్ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు ప్రారంభించడంతో న్యాయవిద్య వైపు వెళ్లే విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్‌గౌడ్, జాయింట్ సెక్రటరీ శివకుమార్, కోశాధికారి మురళి, న్యాయవాదులు పూర్ణకుమార్, రాజేష్, శ్రీకాంత్, భాస్కర్, చంద్రశేఖర్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

కారు ఢీకొని కూలీ మృతి



ప్రమాద స్థలంలో తావు మృతదేహం

ఇబ్రహీంపట్నం: కారు ఢీకొని ఓ కూలీ మృత్యువాత పడగా మరొకరికి గాయాలైన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మంచాల మండలం లోయపల్లి గ్రామానికి చెందిన కొర్రతావు(52) ఇబ్రహీంపట్నం చెరువు కట్ట రహదారి పక్కన కంప చెట్లను తొలగించే పనికి వచ్చారు. జేసీబీ సహాయంతో కంపచెట్లను తొలగించే పనులు కొనసాగుతుండగా.. ఈ సందర్భంగా ఏలాంటి ప్రమాదాలు జరగకుండా రోడ్డుపై వెళ్లే వాహనాలకు ఎర్ర జెండాతో కొర్రతావు సూచికలు చేస్తున్నాడు. ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అదుపుతప్పి వేగంగా వచ్చి కొర్రతావును ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు నడుపుతున్న మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లికి చెందిన వెంకయ్య(50)కు ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో కట్టపై ట్రాఫిక్‌జామ్ అయ్యింది. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'కంచె'పట్టు చీరలు

గ్రామాల్లో మొక్కజొన్న పంటకు అడవిపందుల బెడద ఎక్కువవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలను కాపాడుకోవడానికి ఇంట్లో ఉన్న పాత చీరలను పొలం చుట్టూ కట్టి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. అధికారుల సూచనలు పాటించి తెగుళ్ల నివారణ సులువుగానే చేస్తున్నా.. రాత్రివేళ్లలో అడవిపందుల బెడదను మాత్రం నివారించలేక పోతున్నామని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు పందుల బెడదను తగ్గించాలని రైతులు కోరుతున్నారు.

– షాబాద్



మొక్కజొన్న పంట చుట్టూ కట్టిన చీరలు